సాక్షి నిర్మల్

శనివారం : 21 : సెప్టెంబర్ : 2024



కొత్తసార్లు వచ్చేదెప్పుడో..

ఏడేళ్ల తర్వాత డీఎస్సీ పరీక్షలను జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు విద్యాశాఖ నిర్వహించింది. సెప్టెంబర్ 6న ఫైనల్‌కీ విడుదల చేసింది. ఫలితాలు ప్రకటించలేదు. 8లో▸

భువన్ ఫేజ్-2 సర్వే

నిర్మల్‌టౌన్: పట్టణంలో సీడీఎంఏ హైదరాబాద్ ఆధ్వర్యంలో భువన్ ఫేజ్-2లో భాగంగా ఇంటింటా సర్వే(కొలతలు) సేకరించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నిర్మల్ మున్సిపల్ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాల కొలతలకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకరించాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.1 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పిల్లలకు పోషకాహారం అందించాలి

• డీఆర్డీవో విజయలక్ష్మి



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మన ఇంట అంగన్‌వాడీ వంట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఇందులో హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఈజీఎస్ ఏపీవో జయదేవ్, ఐకేపీ ఏపీఎం రాజారాం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



మల్లీశ్వరి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న మల్లీశ్వరి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. త్వరలో పంజాబ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. మల్లీశ్వరిని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుజాత, పీఈటీ సుమలత అభినందించారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

• డీపీవో శ్రీనివాస్



మానవ హారం నిర్వహిస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: స్వచ్ఛత అందరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. మండల కేంద్రంలో డ్రైనేజీను పర్యవేక్షించారు. కేజీబీవీలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు తయారుచేసిన భోజనం పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై వైద్యశాఖ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం లక్ష్మణచందా గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో శానిటేషన్ పనులను, డ్రైనేజీలను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. దోమలు పెరగకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, ఏపీవో ప్రమీల, ప్రిన్సిపాల్ నవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పేరెంట్స్ సమావేశం నిర్వహించాలి

నిర్మల్ రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ సమావేశం నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. సమావేశంలో ఎజెండాలోని అంశాలు చర్చించాలన్నారు. సమావేశం ఫొటోలు తీసి, మినిట్స్ రాసి వాటిని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

22న తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 22 జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆరెపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఇందులో అసలైన ఉద్యమకారులను గుర్తిస్తారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆగని ఆక్రమణలు!



జిల్లాకేంద్రంలో చైన్‌గేట్ వద్ద కాలువగా మారిన కందకం

- కాలువలు, కందకాలూ కబ్జా
- సర్కారు జాగాల్లో యథేచ్ఛగా పాగా
- ప్లాట్లుగా మార్చి విక్రయం
- కొనుగోలు చేసి మోసపోతున్న అమాయకులు



జిల్లాకేంద్రంలోని చెరువులో పోసిన మట్టి

నిర్మల్: ఓవైపు హైదరాబాద్‌లో ఆక్రమణదారులను హైడ్రా బెంబేలెత్తిస్తున్నా.. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాలాంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డే ప్రకటించారు. అయినా నిర్మల్‌లోని ఆక్రమదారులకు ఇవేమీ పట్టడం లేదు. కబ్జానే పరమావధిగా కాలువలు, కందకాలు, ప్రభుత్వ స్థలం అని తేడా లేకుండా ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఎవరేం చేస్తారన్న ధీమానా..! లేక తమవరకు వచ్చేలోపే ఆక్రమించిన భూములను అమాయకులకు అంటగట్టేద్దామన్న ఆలోచననా..! ఏదైతేనేం జిల్లాలో ఆక్రమణలు మాత్రం ఆగడంలేదు. ఇదివరకే కబ్జా చేసిన వాటిని ఎలాగైనా తమ పేరిట చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తక్కువ ధరకు వస్తున్నాయన్న ఆశతో అక్రమణ భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఇబ్బంది పడుతున్నారు.

అప్పుడు కందకం.. ఇప్పుడు కాదా..?

20 ఏళ్లక్రితం కందకంగా పేర్కొన్న ప్రాంతం ఇప్పుడు ప్రైవేటు భూమి ఎలా అవుతుంది...? అసలు.. ఎప్పుడో నలభయేళ్ల కిందట చేసిన అప్రూవుడ్ లేఅవుట్‌లోనే ఈ వైపు కందకం ఉందని పేర్కొన్న ప్రాంతం ఇప్పుడెలా మారుతుంది..!? అంటే.. జిల్లాకేంద్రంలో అలాగే జరుగుతుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చెరువులు, కందకాలు, చివరకు కాలువలూ వదలకుండా కబ్జాలు చేసిన తీరు విస్తుగొల్పుతోంది. స్థానిక భాగ్యనగర్ కాలనీ ఎప్పుడో 40 ఏళ్ల క్రితం జిల్లాకేంద్రంలో తొలి అప్రూవుడ్ లేఅవుట్‌గా చేశారు. అప్పుడే కాలనీ చుట్టూ ఏమున్నాయో స్పష్టంగా మ్యాప్‌లో గుర్తించారు. ఈ కాలనీ కమాన్ ప్రాంతంలో ఒకప్పుడు కందకం ఉండేది. ఈ విషయంలో సదరు లేఅవుట్లోనూ ఉంది. కానీ.. తాజాగా ఇక్కడి కమాన్ పక్కన ప్రైవేటు స్థలంగా హద్దులు పెట్టడం చర్చనీయాంశమైంది. సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు గుంతలు తవ్వగా, అప్పటి రెవెన్యూ అధికారులు ఇది కందకం(ప్రభుత్వస్థలం) అంటూ నోటీసులు ఇచ్చారు.

హైడ్రా వచ్చే లోపే..

ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్న విషయం తెలుసుకున్న ఆక్రమణదారులు వేగంగా పావులు కదుపుతున్నారు. నిర్మల్ వరకు హైడ్రానో, నిద్రానో వచ్చేలోపే తమ పని పూర్తిచేసుకుని బయటపడాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు చెరువుల శిఖాలు బ్జా చేసిన భూములు, కందకాలను మాయం చేసి రాసుకున్న వాటిని ప్లాట్లుగా మార్చి అమాయకులకు అంటగట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. మరోవైపు గతంలో ఇలాగే తక్కువ ధరకు వస్తుందన్న ఆశలో కొంత మంది చెరువు శిఖాల్లో ఉన్న ప్లాట్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం అలాంటి వాటిపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తుండటంతో బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే స్థానిక చిన్న రాంసాగర్ చెరువుకు సంబంధించి ప్రియదర్శినినగర్(ఎన్‌టీఆర్‌మార్గ్) ప్రాంతంలో పలువురు ప్లాట్లను కోల్పోవాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో సంబంధిత అధికారులు సైతం చెరువులు, కందకాలు, కాలువలు, బఫర్‌జోన్‌లలో ఉన్న స్థలాలను కొని మోసపోవద్దని సూచిస్తున్నారు.

బఫర్‌జోన్ కాదా..!?

జిల్లా కేంద్రంలో చెరువు గర్భాలు, కందకాల మధ్యవరకూ మట్టిపోసి తమవశం చేసుకుంటున్నారు. అలాంటివాళ్లకు బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్ అనే విషయాలు ఏం తెలుస్తాయన్న చర్చ జరుగుతోంది. చెరువులకు ఉన్నట్లే కందకాలకూ ఎంతోకొంత బఫర్ జోన్ ఉంటుంది. కానీ.. ఇక్కడ నేరుగా కందకాన్నే మాయం చేసి, అవసరమైతే దాన్ని ప్రహరీపైనే పునాది వేసేస్తున్నారు. స్థానిక బస్‌డిపో పక్కన కందకం ఇప్పటికే ఖతమైపోయింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 58, 59 జీవోలను అడ్డుపెట్టుకుని తమకు చెందాల్సిన స్థలంతోపాటు అదనంగా కందకానికి సంబంధించిన భూమిని ఆక్రమించేశారు. ఇందులో ఒకరిద్దరు బడావ్యాపారుల నుంచి రెవెన్యూ అధికారులు మాముళ్లు తీసుకుని పని చేసిపెట్టినట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

చెరువులు వదలరా..!

చెరువు భూములను చెరపడితే సినీనటుడు నాగార్జున సహా ఎంతోమంది సెలబ్రిటీల ఆస్తులనే కూల్చేశారు. చెరువులకు సంబంధించిన భూములను ఎట్టి పరిస్థితుల్లో ముట్టకోవద్దని న్యాయస్థానాలూ స్పష్టంగా తీర్పులు ఇచ్చాయి. తాజాగా హైడ్రా సైతం ఇలాంటి ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. కానీ.. జిల్లాలో మాత్రం ఆక్రమణలను తగ్గించుకోకుండా, చెరువులోకే మరో అడుగు ముందుకేస్తున్నారు. చిన్నరాంసాగర్, ఇబ్రహీం చెరువు, ఇబ్రహీంసాగర్, కంచెరోని చెరువు, ధర్మసాగర్ వెనుకవైపు తదితర చెరువుల భూముల్లో ఇప్పటికే ఉన్న ఆక్రమణలు ఉండగా, కొత్తగా మరింత పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు ఇప్పటికే చెరబట్టిన భూములను ఎలాగైన తమ పేరిట చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధికి 'బాలశక్తి'

- 52 రెసిడెన్సియల్ పాఠశాలల్లో అమలు..
- 6 నుంచి 12 తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన
- కలెక్టర్ అభిలాష అభినవ్



బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కస్బా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో బాలశక్తి కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్య, నైపుణ్య అభివృద్ధికి బాలశక్తి కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని 52 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, క్షేత్ర పర్యటన అనుభవాలు, నైపుణ్య అభివృద్ధి, సాధికారత వంటి అంశాలపై అవగాహన కల్పించడం బాలశక్తి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులకు వివిధ విభాగాలలో నైపుణ్యాలను, నిత్యజీవితంలోని రోజువారీ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు బ్యాంకింగ్ విభాగంలో అందించే వివిధ రకాల సేవలు, సైబర్ నేరాలపై అవగాహన, గ్రామ, మండలస్థాయిలో పౌర సేవలకు సంబంధించి అంశాలను వివరించడం, కలెక్టర్ కార్యాలయాల సందర్శన, పోస్ట్ ఆఫీస్, పోలీస్ స్టేషన్, గ్రామపంచాయతీ, మండల కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మీసేవ, అంగన్‌వాడీ కేంద్రాలు, కుటీర పరిశ్రమలు, ప్రాజెక్టులు, వ్యవసాయ పరిశోధన క్షేత్రాలకు క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి పలు సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారుచేసి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యాధులు, ఒత్తిడిని జయించుట, స్వీయ రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామీణ మండల స్థాయి అధికారులు, ఎన్జీవోలు, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలశక్తి కార్యక్రమం రాష్ట్రంలోనే మొదటగా నిర్మల్ జిల్లాలో ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవల నిర్వహణ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, తాహసీల్దార్ స్వాతి, ఎంఈవో శంకర్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బాలశక్తి' పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

దిలావర్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. దిలావర్‌పూర్ కేజీబీవీ ప్రాంగణంలో బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. రోజువారీ కార్యక్రమాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలని సూచించారు. ఈసందర్భంగా కేజీబీవీలో నిర్వహించిన వ్యాసరచన, పేయింటింగ్ తదితర వాటిల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, తహసీల్దార్ స్వాతి, ఎంఈవో శంకర్, కేజీబీవీ ఎస్‌వో అపర్ణ, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కంటిమీద కునుకు లేకుండా బందోబస్తు

• ఎస్పీ జానకీషర్మిల



ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: వారం రోజులు కంటిమీద కునుకు లేకుండా పోలీసులు గణేశ్ బందోబస్తు విధులు నిర్వహించారని, అవిశ్రాంతంగా పనిచేసి వేడుకలు ప్రశాంతంగా జరిగిన పోలీసులకు సెల్యూట్ అని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. ముధోల్, భైంసా, నిర్మల్, ఖానాపూర్‌లో వరుసగా నిమజ్జనాలు జరగడంతో పోలీసులు అవిశ్రాంతంగా విధులు నిర్వర్తించారని తెలిపారు. బందోబస్తు విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన పోలీసులకు జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడి విధులు నిర్వర్తించిన సిబ్బందిని అభినందించారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ శాఖలను పోలీసులు సమన్వయం చేసుకుంటూ పనిచేశారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లోనూ విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ మాట్లాడుతూ... నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి చేసినందుకు అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారన్నారు. గతంలో భైంసాలో జరిగిన సంఘటనను చూసి భయపడ్డారని, దానికి విరుద్ధంగా ఈసారి బందోబస్తును చూసి హర్షం వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్, ఐటీ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాసీ ప్రజావాణిలో జిల్లావాసుల ఫిర్యాదు

• జైళ్లలో మగ్గుతున్న తమవారిని విడిపించాలని వినతి



వినతిపత్రాలను అందిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

నిర్మల్‌ఖిల్లా: బతుకుదెరువు కోసం ఉన్న ఊరిని, కన్నవారిని విడిచి వెళ్లిన జిల్లావాసులు గల్ఫ్‌దేశాల్లో ఊచలు లెక్కిస్తున్నారు. వివిధ కారణాలతో చేయని నేరానికి జైలు జీవితం అనుభవిస్తున్నారు. ఈ క్రమంలోనే గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం నూతనంగా 'ప్రవాసీ ప్రజావాణి' పేరిట ఫిర్యాదుల విభాగం ప్రారంభమైంది. జిల్లాలోని కడెం మండలం ఎలగడప గ్రామవాసి దుర్గం ఆనంద్ సౌదీ అరేబియాలో.. అదేవిధంగా సారంగాపూర్ మండలం కౌట్ల-బి గ్రామానికి చెందిన తొగరి చిన్నయ్య దుబాయ్‌లో జైలుజీవితం అనుభవిస్తున్నారు. వీరి కుటుంబ సభ్యులు శుక్రవారం జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు స్వదేశ్ పరికిపండ్ల, కొమ్ము గీత తదితరుల సహాయంతో ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమంలో అక్కడి నోడల్ అధికారి, ఐఏఎస్ దివ్య దేవరాజన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు సాధారణ పరిపాలన శాఖ ద్వారా సత్వర పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తాం

• పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూటీఎస్ సంఘం కట్టుబడి ఉందని జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించేందుకు సంఘం రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందన్నారు. సత్వరమే రెండు డీఏలు ప్రకటిస్తూ, సీపీఎస్ రద్దు చేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు వెల్లడించారు. అనంతరం నిర్మల్ అర్బన్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బల్స గజ్జారం, ప్రధాన కార్యదర్శిగా సగ్గం స్వామి, అసోసియేట్ అధ్యక్షుడిగా రోహిదాస్, ఉపాధ్యక్షురాలుగా ఏ.గంగామణి, కార్యదర్శిగా లక్ష్మణ్‌గౌడ్ ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భూమారెడ్డి, పరమేశ్వర్, మునీందర్, సాయికుమార్, శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ చిత్రకారునికి జిల్లా చరిత్ర గ్రంథం బహూకరణ



లక్ష్మణ్‌కు గ్రంథాన్ని అందిస్తున్న దేవరావు

నిర్మల్‌ఖిల్లా: ప్రముఖ తెలంగాణ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్‌కు జిల్లాకేంద్రంలోని స్థానిక లుంబిని వనంలో 'నిర్మల్ జిల్లా సమగ్రస్వరూపం' సంకలన గ్రంథాన్ని కవి, రచయిత తుమ్మల దేవరావు శుక్రవారం అందజేశారు. ఏలె లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాష్ట్రానికి సంబంధించిన మోనోగ్రామ్ తయారుచేసి ప్రసిద్ధికెక్కారు. ఆయన వేసిన పెయింటింగ్స్, మోనోగ్రామ్స్ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందాయి. తెలంగాణలోని ప్రాచీన చిత్రకళ మీద, గ్రామీణ వృత్తి కళాకారులు వేసే పటాల మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. జాతీయ అవార్డు పొందిన తెలుగు చిత్రం మల్లేశం కు పనిచేసారు. ఇక నిర్మల్ ప్రాచీన చరిత్రను అక్షరబద్ధం చేసిన నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపాన్ని 2 వేల ఏళ్ల నిర్మల్ జిల్లా చరిత్రను నిక్షిప్తం చేయడం అభినందనీయమని లక్ష్మణ్ అన్నారు. నిర్మల్ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసిన కొయ్యబొమ్మల సమగ్ర వ్యాసాలు ఇందులో పొందుపరిచినట్లు దేవరావు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

• డీఈవో రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్ రెడ్డి

నిర్మల్ రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలని రవీందర్‌రెడ్డి సూచించారు. విద్యాశాఖ, రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులకు జిల్లా కేంద్రంలో ఎఫ్‌ఎల్‌ఎన్‌పై శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు సూచనలు చేయాలన్నారు. రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ వారు విద్యార్థులకు రంగురంగుల కథల పుస్తకాలను అందిస్తున్నారని, వాటిని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. సంస్థ ఇప్పటికే ఏర్పాటు చేసిన మోడల్ గ్రంథాలయాలు విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చూడాలన్నారు. పాఠశాలల్లో సిలబస్ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య, రిసోర్స్ పర్సన్ విజయ్‌కుమార్, జిల్లా పరీక్షల అధికారి పద్మ, ఎస్‌వో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. నిర్మల్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఆమెడ కిషన్, అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ట్రెజరర్ అశోక్ కుమార్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, భోజన్న, భూమన్న, అన్నపూర్ణ, జమున, అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థిని అభినందిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో చదివి మెడికల్ సీటు సాధించిన పూర్వ విద్యార్థులు జబ్బార్, సమీర్, అద్నాన్, రషీద్‌ను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జబ్బార్, ఎంఐఎం నాయకులు ఫైజుల్లాఖాన్, డాక్టర్ నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాలీబాల్ విజేత శ్రీరాంపూర్



మొదటి బహుమతి పొందిన శ్రీరాంపూర్ జట్టు

శ్రీరాంపూర్: వాలీబాల్ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు మొదటి బహుమతి సాధించింది. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు రామగుండం 3, భూపాల్‌పల్లి జట్టుపై విజయం సాధించింది. ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈసారి కోలిండియా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, క్రీడల గౌరవ కార్యదర్శి సృజన్‌పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు చాట్ల అశోక్, నరేందర్‌రెడ్డి, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజన క్రీడోత్సవాల షెడ్యూల్ ఖరారు

ఉట్నూర్‌రూరల్: గిరిజన క్రీడోత్సవాల షెడ్యూల్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శుక్రవారం ప్రకటించారు. ఆశ్రమ పాఠశాలల బాలబాలికలకు 14, 17 ఏళ్ల విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వాలీబాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, టెన్నీకాయిట్, ఆర్చరీ, చెస్, క్యారం క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 21న ఆయా పాఠశాలల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 24న ఆయా డివిజన్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ నెల 27న జోనల్ స్థాయి ఎంపిక పోటీలు ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన వారు నవంబర్ మొదటి వారంలో ఉట్నూర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల విజయవంతానికి ఉమ్మడి జిల్లాలోని డీడీలు, డీటీడీవోలు, క్రీడాధికారులు, ఏటీడీవోలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ ఆలయంలో చోరీ చేసిన ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు. మండలంలోని కనకాపూర్ శివారులోని హనుమాన్ ఆలయంలో జగిత్యాల జిల్లా రాయికల్ గ్రామానికి చెందిన గంధం అర్జున్, గంధం నరేష్ చోరీ చేశారు. ఇనుప కడ్డీతో గుడి తాళం పగులగొట్టి హుండీలో ఉన్న రూ.1,500 ఎత్తుకెళ్లారు. శుక్రవారం కనకాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న అర్జున్, నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారిని విచారణ చేయగా కనకాపూర్ ఆలయంలో చోరీ చేసినట్లు వెల్లడించారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కొత్తసార్లు వచ్చేదెప్పుడో..



తోటి విద్యార్థిని ద్వారా పాఠ్యాంశాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులు(ఫైల్)

- డీఎస్సీ ఫలితాలు ప్రకటించని ప్రభుత్వం
- పరీక్ష నిర్వహించి రెండు నెలలు
- ఫైనల్ కీ విడుదలతోనే సరి..
- ఫలితాలు ప్రకటిస్తే ఉమ్మడి జిల్లాలో 1,295 పోస్టులు భర్తీ

నిర్మల్‌ఖిల్లా: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం సుదీర్ఘకాలంగా ఎదురు చూసిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగులకు ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించి శుభవార్త చెప్పింది. దీంతో చాలా మంది పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఏడేళ్ల తర్వాత డీఎస్సీ పరీక్షలను జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు విద్యాశాఖ నిర్వహించింది. దీంతో ఉద్యోగాల భర్తీపై భరోసా ఏర్పడింది. సెప్టెంబర్ 6వ ఫైనల్‌కీ విడుదల చేసింది. ఇక ఫలితాలు ప్రకటించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేసి, తుది ఎంపిక జాబితా విడుదల చేయడంతోపాటు నియామక పత్రాలను అందించాల్సి ఉంది. పరీక్షలను విజయవంతంగా రాసిన నిరుద్యోగులు ఉపాధ్యాయకొలువు వస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. మరోవైపు కొత్తసార్లు ఎప్పుడొస్తారో అని ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఖాళీలు ఇలా...

జిల్లాల వారీగా ప్రకటించిన ఖాళీలు పరిశీలిస్తే నిర్మల్‌లో 342, ఆదిలాబాద్‌లో 324, మంచిర్యాలలో 288, ఆసిఫాబాద్‌లో 341 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,295 ఖాళీలకు దాదాపు 30 వేల మంది డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో డీఎస్సీ పరీక్ష 80 మార్కులకు, టెట్ వెయిటేజీని 20 మార్కులకు నిర్ణయించి, పరీక్షల ఫైనల్ కీని కూడా విడుదల చేయడంతో హాజరైన అభ్యర్థులకు ఉద్యోగ సాధనకు కావాల్సి మార్కులు తేటతెల్లమైంది. అయితే జనరల్ మెరిట్‌లిస్టు విడుదల, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ మిగిలి ఉంది. ఇదంతా పూర్తయితే ఉద్యోగ నియామక పత్రాలను అందజేసేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులు కొరత కూడా తీరుతుంది.

ఉమ్మడి జిల్లాలో భర్తీకానున్న పోస్టుల వివరాలు..

జిల్లా	ఖాళీలు
నిర్మల్	342
ఆదిలాబాద్	324
మంచిర్యాల	288
ఆసిఫాబాద్	341
మొత్తం	1,295



మరో డీఎస్సీకి అవకాశం...

ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో గతంలో లెక్కించిన ప్రామాణికతగా మేరకు ఖాళీలను సేకరించారు. అయితే ప్రస్తుతం బదిలీ ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడం, పదవీ విరమణ గత ఏప్రిల్ నుంచి మొదలు కావడంతో మరిన్ని ఖాళీలు ఏర్పడుతున్నాయి. వీటన్నిటినీ కలుపుకొని కొత్త డీఎస్సీ నిర్వహించనునట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించారు. ప్రస్తుతం డీఎస్సీ ఫలితాలు ప్రకటిస్తే.. మరో డీఎస్సీ నిర్వహణకు మార్గం సుగమమం అవుతుంది.

సుదూర ప్రాంతాల్లోనే ఎక్కువ ఖాళీలు...

ఆయా నూతన జిల్లాల్లో గత జూన్, జూలై నెలలో నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో సీనియర్ ఉపాధ్యాయులు పట్టణ, సమీప ప్రాంతాలకు బదిలీలలో ప్రాధాన్యం చూపడంతో సుదూర ప్రాంతాలు, పల్లెలు, గిరిజన తండాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. అయితే ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు తాత్కాలికంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. నూతన ఉపాధ్యాయుల పోస్టింగులను ఇస్తే ఆ ఖాళీలన్నీ భర్తీ కానున్నాయి.

ప్రక్రియ కొనసాగుతోంది...



గత జూలైలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఫైనల్ కీ విడుదల చేసింది. విద్యాశాఖ సాధ్యమైనంత మేరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేసి పోస్టింగులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. కొత్త ఉపాధ్యాయులు వస్తే కొరత కూడా తీరుతుంది. పూర్తిస్థాయిలో టీచర్లు అందుబాటులోకి వస్తారు.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

కర్రతో దోమ తయారీ



ప్రభాకర్ కర్రతో తయారు చేసిన బుల్లి దోమ

వేమనపల్లి: తన ప్రతిభతో ఎన్నో కళాత్మక వస్తువులకు జీవం పోస్తున్న నీల్వాయికి చెందిన జంబోజి ప్రభాకర్ ఖాతాలో మరో రికార్డు చేరింది. తాజాగా కర్రతో బుల్లిదోమను తయారు చేశాడు. మానవాళికి ప్రాణాంతకంగా మారిన దోమకు ఒక నిర్మాణం ఇవ్వాలనే ఉద్దేశంతో తయారు చేసినట్లు తెలిపాడు. గతంలో వేప ఆకు నుంచి, ఆ తర్వాత చింతాకు నుంచి చీరను తీశాడు. చిటికెను వేలు సహాయంతో రెండు సైకిళ్లను లేవనెత్తాడు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు వరకు వెళ్లి తృటిలో చేజార్చుకున్నాడు. కుటుంబ ఆర్థిక సమస్యల వల్ల కొన్ని రోజులు తన ప్రతిభను పక్కన బెట్టాడు. గతేడాది వెండితో చిన్న దోమను చేయగా తాజాగా కర్రతో బుల్లి దోమను తయారు చేశాడు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతకు రంగం సిద్ధం..?

- ఇళ్ల నంబర్లు తొలగింపు
- నిర్మాణదారుల్లో ఆందోళన



ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇళ్లు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీ పరిధి గెర్రెకాలనీలోని 840 సర్వేనంబరులో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్ల కూల్చివేతకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలు అంటూ మున్సిపల్ అధికారులు 34మందికి ఈ నెల 12న నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నోటీసులు జారీ చేసి వారం రోజులు కావడంతో మున్సిపల్ అధికారులు ఇళ్లకు కేటాయించిన నంబర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ నివేదిక అందజేశారు. కలెక్టరేట్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేయడం, ఇళ్ల నంబర్లు తొలగించడంతో నిర్మాణాల కూల్చివేత తప్పదని ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు సైతం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో రెండ్రోజుల్లో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంతో కూల్చివేతను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

నివేదిక సమర్పించాం..

రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు 840 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చాం. సదరు యజమానులు ఇచ్చిన సంజాయిషీ అసంతృప్తిగా ఉండడంతో నోటీసులు ఇచ్చిన 34 మందికి సంబంధించిన ఇంటి నంబర్లు తొలగించాం. ఈ జాబితా నివేదికను రెవెన్యూ అధికారులకు అందజేశాం.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

సౌత్‌జోన్ పోటీల్లో పతకాల పంట



విజేతలతో శిక్షకులు, మేనేజర్

ఆదిలాబాద్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో ఏడు పతకాలతో మెరిశారు. అండర్ -14 విభాగంలో ట్రయథ్లాన్–సీ ఈవెంట్‌లో నగేశ్, ట్రయథ్లాన్–బీ ఈవెంట్‌లో కార్తీక్ స్వర్ణ పతకాలు సాధించగా, జావెలిన్ త్రోలో జకేష్ కాంస్య పతకంతో నిలిచాడు. అండర్–16 విభాగంలో జావెలిన్ త్రోలో సతీశ్, 60 మీటర్ల పరుగులో విక్రమ్ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్– 20 విభాగంలో హైజంప్‌లో అశ్విని స్వర్ణ పతకంతో మెరవగా, హ్యామర్ త్రోలో వంశీ కాంస్య పతకం సాధించినట్లు ట్రైనర్స్ రాకేశ్, సునంద్, మేనేజర్ రాహుల్ తెలిపారు. విజేతలకు జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేశ్, పెటా ప్రధానకార్యదర్శి స్వామి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జ్యోతిస్వరన్ తదితరులు అభినందనలు తెలిపారు.

వ్యభిచార గృహ నిర్వాహకులు అరెస్ట్



విలేకరుల సమావేశంలో అరెస్టు చూపిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగడిలో ఉన్న పద్మావతి కాలనీలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న దంపతులతోపాటు మధ్యవర్తి, విటుడిని, మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. మందమర్రి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పద్మావతి కాలనీలోని ఓ గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేశారు. మహమ్మద్ మొయిన్, సుక్కుల అవంతి దంపతులు మంచిర్యాలలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన పత్తి సత్తమ్మ, విటుడు మంచిర్యాలలోని సున్నంబట్టి వాడకు చెందిన ఆకునూరి సంపత్, ఏలూరుకు చెందిన మరో మహిళ పట్టుబడ్డారు. వారిని విచారించగా సత్తమ్మ ద్వారా మొయిన్, అవంతి గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పత్తి సత్తమ్మ పలువురి అమ్మాయిల ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించి విటులను ఆకర్శిస్తూ పద్మావతి కాలనీలో ఇంటిని వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి నిర్వాహకులతోపాటు సత్తమ్మ, విటుడు సంపత్‌లను అరెస్ట్ చేశామని, బాధిత మహిళను సఖీ సెంటర్‌కు పంపించామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

అడవిలో నివాసం ఏర్పర్చుకున్న వ్యక్తుల అరెస్ట్



అటవీశాఖ అధికారుల అదుపులో గిరిజనులు

జన్నారం: అడవిలో అక్రమంగా నివాసం ఏర్పాటు చేసుకున్న పలువురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజోద్దీన్ తెలిపారు. జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి అటవీ రేంజ్ సోనాపూర్ బీట్ పరిధి కంపార్టుమెంట్ 249లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పది మంది అక్రమంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పులి సంచరిస్తున్నందున మానవ, వన్యప్రాణి హాని జరుగకుండా వన్యప్రాణి, అటవీ చట్టం ప్రకారం లింగాపూర్, జైనూర్, సిర్పూర్ మండలాలకు చెందిన కుమ్రం లక్ష్మణ్, సిడాం మోతిరాం, మెస్రం గంగరాం, నైతం మాన్కు, తొడసం విష్ణు, సిడాం బాలు, ఆత్రం లాల్‌సావ్, పెందోర్ సురేబాన్, పెందోర్ జలపతిరావు, కనక చంద్రభాన్‌లను అరెస్ట్ చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

జ్వరంతో వివాహిత మృతి



రాజేశ్వరి(ఫైల్)

తిర్యాణి(ఆసిఫాబాద్): విష జ్వరంతో తిర్యాణి మండలం సుంగాపూర్ పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన దుర్గం రాజేశ్వరి(27) మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరికి ఎనిమిదేళ్ల క్రితం ఆసిఫాబాద్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌తో వివాహమైంది. భర్త శ్రీకాంత్ హైదరాబాద్‌లో పనిచేస్తుండగా.. రాజేశ్వరి సుంగాపూర్‌లోని తల్లి వద్ద ఉంటోంది. రాజేశ్వరికి మూడు రోజుల క్రితం జ్వరం రాగా కుటుంబ సభ్యులు స్థానికంగా ఆర్‌ఎంపీ వద్ద చికిత్స అందించారు. ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతిరాలికి ఇద్దరు కుమారులు సాత్విక్(3), శ్రీహాన్ (10 నెలలు) ఉన్నారు. చిన్నారులు కన్నతల్లి మృతదేహంపై పడి రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. రాజేశ్వరి మృతితో సుంగాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది.

రక్త కణాలు తగ్గి యువతి..



ప్రీతి(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీ నగర్‌కు చెందిన చంద్రే ప్రీతి(22) డెంగీతో గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. ప్రీతి వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. రక్త కణాల సంఖ్య పడిపోవడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన యువతి శుక్రవారం పీజీ ఎంట్రన్స్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, అంతలోనే మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

శనిగకుంట మత్తడి పేల్చేసిన నిందితుల అరెస్ట్

- డ్రిల్లింగ్ మిషన్, ట్రాక్టర్, జిలిటెన్ స్టిక్స్ స్వాధీనం
- మంచిర్యాల డీసీపీ భాస్కర్



సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

చెన్నూర్: మంచిర్యాల జిల్లా శనిగకుంట మత్తడి పేల్చేసిన ఘటనలో చెన్నూర్‌కు చెందిన పెండ్యాల లక్ష్మీనారాయణ ఉరఫ్ లక్ష్మణ్, భీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్, మంచిర్యాల ఏసీసీ ప్రాంతానికి చెందిన గోగుల దానయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. డ్రిల్లింగ్ మిషన్, ట్రాక్టర్, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ వివరాలు వెల్లడించారు. శనిగకుంట మత్తడిని ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తులు పేల్చేశారని ఇరిగేషన్ ఏఈ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం ఉదయం చెన్నూర్ పట్టణంలోని బేతాళవాడకు చెందిన పెండ్యాల లక్ష్మీనారాయణ ఇంటి వద్ద అతడితోపాటు అక్కడే ఉన్న భీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్‌లను అదుపులోకి విచారించగా.. ఏసీసీ ప్రాంతానికి చెందిన గోగుల దానయ్యతో కలిసి మత్తడిని పేల్చేసినట్లు అంగీకరించారు. దానయ్యను చెన్నూర్ మండలం కిష్టంపేట శివారులో అరెస్ట్ చేసి కంప్రెషర్, డ్రిల్‌మిషన్ ట్రాక్టర్ తోపాటు నాలుగు జిలిటెన్ స్టిక్స్, 50 మీటర్ల ఐరన్ జేఏ వైర్ స్వాధీనం చేసుకున్నారు.

కాలనీలోకి నీరు వస్తుందని..

శనిగకుంట చెరువు కింది భాగంలో బేతాళవాడ కాలనీ ఉంది. చెరువు పక్కనే ఉన్న 356 నుంచి 360 సర్వేనంబర్లలో 15.20ఎకరాల పట్టా భూములను చెన్నూర్‌కు చెందిన మంచాల రాజబాపు, నడిపల్లి లక్ష్మణ్‌రావు, లక్కం రాజబాపు, రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, పెద్దంటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఎన్నం బానయ్య, ఇప్ప సంపత్, ఉమేశ్‌గిల్డా బృందంగా ఏర్పడి కొనుగోలు చేశారు. అనంతరం వీరు చెన్నూర్‌కు చెందిన గొడిసెల బాపురెడ్డికి విక్రయించారు. ఇందులో 4.20 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కాగా.. 11 ఎకరాలు చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉండడం రిజిస్ట్రేషన్ కాలేదు. వర్షాకాలంలో నీరు వస్తుందని చెరువు వైపు ఎత్తుగా మట్టి పోయించారు. దీంతో చెరువు నీరు దిగువ ప్రాంతమైన బేతాళవాడ చివరిగా ఉన్న నివాస గృహాలకు ముంపు సమస్య పెరిగింది. పెండాల్య లక్ష్మణ్ వాడ కావడంతో ముంపు సమస్య పరిష్కారానికి స్నేహితులు భీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్‌లతో మత్తడి ఎత్తును డ్రిల్ చేసి తగ్గించాలని పథకం రచించారు. గోగుల దానయ్యను సంప్రదించగా రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నెల 13న మత్తడిని డ్రిల్‌తో పగులగొట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. కాంక్రీట్‌తో నిర్మించిన మత్తడి కావడంతో జిలిటెన్ స్టిక్స్ పెట్టి పేల్చేద్దామని దానయ్య తెలిపాడు. నల్గొండలో తనకు తెలిసి వారి వద్ద జిలిటెన్ స్టిక్స్ ఉన్నాయని కొంత ఖర్చవుతుందని చెప్పగా.. భీమ్ మధుకర్ డబ్బులు పంపించాడు. ఈ నెల 16న రాత్రి డ్రిలింగ్ మిషన్‌తో రంధ్రాలు చేసి జిలిటెన్ స్టిక్స్‌తో పేల్చేశారని డీసీపీ వివరించారు. కేసు విచారణ సాగుతోందని, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ వ్యక్తుల ప్రమేయంపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. కేసును ఛేదించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ రవీందర్, ఎస్సై శ్వేత, కానిస్టేబుళ్లు టిక్కయ్య, భూమన్న, హోంగార్డు ఖదీర్‌లను అభినందించారు.

దేగాంలో ఇద్దరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో వేర్వేరు కారణాలతో ఇద్దరు యువకుల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కోనేరు పోశెట్టి(26) కూలీ పనులుచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా భార్య, అత్తింటివారు వేధిస్తుండడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్యతో, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..

దేగాం గ్రామానికి చెందిన దావుల నరేశ్(28) మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేశ్ నిత్యం మద్యం తాగివచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. దీంతో ఐదు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన నరేశ్.. జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనస్థలానికిచేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మానసిక స్థితి బాగాలేక..

దండేపల్లి: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన అనూష(32) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనూషకు 14ఏళ్ల క్రితం లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ఆరేళ్లుగా ఆమె మానసిక పరిస్థితి బాగో లేక పిచ్చిగా ప్రవర్తిస్తోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబ సభ్యులు కాపాడారు. ఇటీవల చింతపల్లిలోని తన పుట్టింటికి వచ్చిన ఆమె శుక్రవారం తెల్లవారుజామున కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు వెతుకగా.. ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. మృతురాలి తండ్రి గొర్ల తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

వ్యాధి నయం కావడం లేదని..

తలమడుగు: అనారోగ్యంతో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఝరి గ్రామానికి చెందిన బూరుగు సుజాత (36) అనే వివాహిత పదేళ్లుగా నాలుక క్యాన్సర్‌తో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించినప్పటికీ తగ్గకపోవడంతో కొంతకాలంగా ఆమె మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అందులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



పోశక్క మృతదేహం

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామానికి చెందిన గోలెం పోశక్క(55) శుక్రవారం పిడుగుపాటుకు మృతిచెందింది. పొలం పనులు ముగించి సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వస్తుండగా ఆకస్మాత్తుగా పిడుగుపడింది. దీంతో పోశక్క అక్కడికక్కడే చనిపోయింది. ఆమె భర్త సింగరేణి కార్మికుడు కాగా కొన్నాళ్ల క్రితం మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి.కిరణ్‌కుమార్ తెలిపారు.